
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 21 నవంబర్ 2025
5
తిరుపతి



తిరుపతి రైల్వే స్టేషన్లో తనిఖీలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



తిరుపతి రైల్వే స్టేషన్లో గురువారం పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు.మావోయిస్టుల "షహీద్ సప్తా" నేపథ్యంలో ప్రయాణికుల భద్రత కోసం తిరుపతి రైల్వే స్టేషన్లో ఆర్పీఎఫ్, జీఆర్పీ సంయుక్తంగా విస్తత తనిఖీలు నిర్వహించాయి. ఏఎస్పీ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్, హెచ్ఐచ్ఎండీలతో లగేజీ, ప్రయాణికులను పరిశీలించారు. ఇన్స్పెక్టర్లు సందీప్ కుమార్, అశీర్వాదం తమ బందాలతో మార్చ్ ఫాస్ట్ నిర్వహించి ప్రయాణికులకు సూచనలు ఇచ్చారు. హెల్ప్లైన్ 139ను ప్రయాణికులు ఉపయోగించుకోవాలని సూచించారు.



జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి, గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన 1214 మెమోను రద్దుచేసి భవన నిర్మాణ కార్మికులకు ఉన్న క్లైమ్‌లను పరిష్కరించాలని తిరుపతి జిల్లా బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్, సిఐటియు సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ 10 లక్షలు దాటి భవన నిర్మాణం చేపట్టే భవన నిర్మాణదారుల నుండి ప్రభుత్వం సెస్ వసూలు చేస్తుందని, అలా వసూలు చేసిన దాదాపు రూ.3 వేల కోట్ల రూపాయలు సంక్షేమ నిధిగా బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో ఉండేదని తెలిపారు. ఈ నిధిపై గతంలో చంద్రబాబు ప్రభుత్వం చంద్రన్న బీమా పేరుతో ఈ నిధులను దారి మళ్ళించిందని, అటు తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా ఇదే బాటలో నవరత్నాల పథకాలకు భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు నిధులను దారి మళ్ళించిందన్నారు. అంతే కాకుండా 1214 మెమోను జారీ చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన నిధులను వారి ప్రయోజనాలకు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారన్నారు. దేశంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం వసూలు చేసే సెస్ ద్వారా ఆ సంక్షేమ నిధి నుండి భవన నిర్మాణ కార్మికులకు పింఛన్లు, గహ నిర్మాణాలకు, భవన నిర్మాణ కార్మికుడి మరణానంతరం ఆ కుటుంబానికి చేయూతగా నిధులు మంజూరు చేసేవారన్నారు. కేరళ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు సొంత

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ఇల్లు నిర్మించి ఇస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ నిధిని ప్రభుత్వాలు దారి మళ్లించడం సరికాదన్నారు. తిరుపతి జిల్లాలో గత నెలలో పరిశీలిస్తే భవన నిర్మాణ కార్మికులు ఆరుగురు పైగా అకాల మరణం చెందారని, రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, అందులో 22 లక్షల మంది రిజిస్టర్ అయి ఉన్నారన్నారు. కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను అకాల మరణం చెందిన భవన నిర్మాణ కార్మికులకు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కాలయాపన చేయడం మంచి పద్ధతి కాదని, వెంటనే భవన నిర్మాణ కార్మికుల సమస్యల పట్ల స్పందించకపోతే సీఎం చంద్రబాబు ఇంటి తో పాటుగా మంత్రుల ఇళ్లను సైతం దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు మునిరాజా, కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును కూటమి ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని, లేకుంటే భవన నిర్మాణ కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా రెవిన్యూ అధికారి నరసింహులు రెండు కలసి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి శ్రీరాములు, రేణిగుంట మండల కన్వీనర్ సెల్వరాజ్, ఆటో యూనియన్ మహిళ కన్వీనర్ దీప, ఆరిఫ్, రఫీ, దాసు, బాలగురవయ్య, నారాయణస్వామి, తిరుమలరెడ్డి, మునిశేఖర్, వేణు, మధు పాల్గొన్నారు.


తిరుమలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



ద్రౌపదిముర్ముకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల తిరుపతి పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం తిరుపతికి విచ్చేశారు. సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆమె రోడ్డు మార్గంలో తిరుచానూరుకు వెళ్లి పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుమలకు బయల్దేరి వెళ్లారు. శ్రీపద్మావతీ విశ్రాంతి భవనం వద్ద టిటిడి ఛైర్మన బిఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు. రాత్రి విశ్రాంతి భవనంలో బస చేస్తారు. శుక్రవారం ఉదయం 9.20 గంటలకు తిరుమల క్షేత్ర పాలకుడు వరాహస్వామిని దర్శించుకుని, అనంతరం 9.50 గంటలకు శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో అనీల్‌కుమార్ సింఘాల్, అనంతపురం రేంజి డిఐజి షిమోషి, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎస్‌పి. ఎల్.సుబ్బరాయుడు, చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని రాష్ట్రపతికి స్వాగతం పలికారు.



తిరుచానూరు అమ్మవారి ఆలయంలో...

వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల వారోత్సవాలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతిలోని బాలుర పరిశీలన గహంలో బాలల వారోత్సవాల్లో ముగింపు కార్యక్రమం గురువారం వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయలసీమ మిమిక్రీ అండ్ మ్యాజిక్ అకాడమీ అధ్యక్షులు డాక్టర్ డి విజయ్ కుమార్, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్, రీజినల్ ప్రెసిడెంట్ తహసునిసా బేగం విచ్చేశారు. జాతీయ భావాలను పెంపొందిస్తూ విజయ్ కుమార్ చేసిన మిమిక్రీ అండ్ మ్యాజిక్ పిల్లలను విశేషంగా ఆకట్టుకుంది. తహసునిసా బేగం మాట్లాడుతూ జీవితంలో బాల్యదశ అద్భుతమైందన్నారు. వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బాలల వారోత్సవాల్లో సందర్భంగా ఒకరోజు కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు పిల్లలకు స్వాతంత్ర సమరయోధుల జీవిత గాధల పుస్తకాల్ని అందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ జస్టిస్ బోర్డ్ మెంబర్స్ మంజుల, నారాయణరెడ్డి, సూపర్డెంట్ శరత్, బాబు పాల్గొన్నారు

శ్రీ పద్మావతీ అమ్మవారికి గొడుగులు బహూకరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు గురువారం ఉదయం చెన్నయ్ దాత 8 గొడుగులను అందజేశారు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా తిరునింద్రవూరుకు చెందిన భాష్య కార్య కైంకర్య ట్రస్ట్ ఛైర్మన్ వెంపటి మాధవ నాయుడు తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయ మండపంలో 8 గొడుగులను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ గొడుగులను పద్మావతీ అమ్మవారి వాహన సేవల్లో ఉపయోగించనున్నారు.

కల్పవృక్ష వాహనంపై అమ్మవారు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం ఉదయం కల్పవృక్ష వాహనంపై మురళి కష్ణ అలంకరణలో పద్మావతి అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం హనుమంత వాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఈ వాహనసేవలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ , జేఈవో వి.వీరబ్రహ్మం, సివిఎస్వో కే.వి.మురళీకష్ణ, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు బాబుస్వామి పాల్గొన్నారు.



రుయాలో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రోడ్డు ప్రమాదంలో రెండు మీటర్లు పొడవున్న ఇనుప చువ్వ ఛాతిలో గుచ్చుకుపోయి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ పేద వ్యక్తికి రుయా వైద్యులు అత్యంత క్లిష్టమైన, అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడారని ఎస్వీఆర్ఆర్ జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధా తెలిపారు. తిరుపతి రుయా హాస్పిటల్ లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అనంతపురం జిల్లాకు చెందిన షేక్ వల్లి (44) జీవనోపాధి కోసం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి కుటుంబ సమేతంగా వలస వచ్చారు. ద్విచక్ర వాహనంపై ఊరూరు తిరుగుతూ నైటీలు అమ్ముకుంటూ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ వ్యాపారంలో భాగంగా నగరికెళ్ళి ద్విచక్రవాహములో కాళహస్తికి తిరిగి ప్రయాణమయ్యారు. పుత్తూరు కి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో రెండు బస్సులు ఓవర్ టేక్ చేయబోయి, స్కూటర్పై వెళ్తున్న షేక్ వల్లిని ఢీకొనడంతో, ఈ ప్రమాదంలో అతను ఎత్తయిన బ్రిడ్జి పై నుంచి ఇనుప చువ్వల పై పడ్డాడు. రెండు మీటర్లు పొడవున్న ఇనుప కమ్మి అతను చాతిలో చొచ్చుకు పోయింది. పుత్తూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రధమ చికిత్స అనంతరం, మెరుగైన చికిత్స కోసం తిరుపతి రూయకు తరలించారు. రుయా ఆసుపత్రిలోని సీటీవిఎస్, జనరల్ సర్జరీ, అనస్థిషియ విభాగాలకు చెందిన వైద్యుల బందం, బాధితుడికి అరుదైన శాస్త్ర చికిత్సలు మూడు గంటల పాటు శ్రమించి విజయవంతంగా నిర్వహించారు. అతను పూర్తిగా కోల్పోవడంతో గురువారం డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి, ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడిన వైద్యం బందాన్ని ఆమె అభినందించారు. ఈ సమావేశంలో కార్డియో తోరాసిక్ సర్జరీ హెచ్ఓడి డాక్టర్ కళ్యాణ్రామ్, అనస్థితి విభాగపు అధిపతి డాక్టర్ పద్మ, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ గౌతమి పాల్గొన్నారు.

వైవి సుబ్బారడ్డిని విచారిస్తున్న 'సిట్'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కల్తీ నెయ్యితో శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో సిట్ అధికారులు గురువారం విచారించారు. ఇప్పటికే సుబ్బారెడ్డి మాజీ పర్సనల్ అసిస్టెంట్ చిన్న అప్పన్నను అరెస్టు చేసి వివరాలను సేకరించారు. ఆయన వాంగ్మూలం ఆధారంగా వైవి సుబ్బారెడ్డిని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. కాంట్రాక్టర్ల నుంచి మాజీ ఛైర్మన్ సుబ్బారెడ్డి సన్నిహితుడైన చిన్న అప్పన్నకు రూ. 4.69 కోట్లు హవాలా లావా ద్వారా ఇచ్చినట్లుగా సిట్ గుర్తించింది. అప్పన్నను నవంబర్ 11న అరెస్టు చేసిన సిట్, అతని ఖాతాలో ఈ మొత్తం ఎలా వచ్చిందో, దాని మూలం ఏమిటో విచారించింది.సిట్ ఇప్పటికే మాజీ అదనపు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ) ఎ.వి. ధర్మారెడ్డిని విచారించింది. ఈ దర్యాప్తు ఫలితాలు త్వరలోనే ఏపీ హైకోర్టుకు సమర్పించనున్నారు. వైవి సుబ్బారెడ్డి అనారోగ్యం అని చెప్పడంతో హైదరాబాద్‌లోని ఆయన ఇంటికే వెళ్లి సిట్ విచారిస్తోంది.

రుయాలో రేడియోథెరపీ యంత్రాన్ని ఏర్పాటు చేయాలి : సిపిఎం


ప్రజాశక్తి - తిరుపతి సిటి



రాయలసీమకే తలమానికంగా ఉన్న తిరుపతి రుయా ఆస్పత్రిలో క్యాన్సర్ నిర్ధారణ, నివారణ సంబంధించి రేడియోథెరపీ యంత్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యం పట్ల పాలకుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో రుయాలో క్యాన్సర్ రోగుల దుస్థితిని బట్టి అర్థమవుతోందన్నారు. 2024లో 140 మంది రోగులు చికిత్స పొందితే, 2025లో 500 మంది పది నెలలకే నమోదయ్యారని తెలిపారు. అయితే కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయసే రేడియోథెరపీ యంత్రం లేకపోవడం సిగ్గుచేటన్నారు. కేవలం 20 కోట్లు కేటాయిస్తే ఈ యంత్రాన్ని కొనుగోలు చేయవచ్చని, పాలకుల నిర్లక్ష్యం ఏ విధంగా ఉందో అర్థమవుతుందన్నారు.

సింగపూర్ విద్యా అధ్యయన యాత్రకు బాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్య పాళెం ఫౌండేషన్ పాఠశాలలో పనిచేస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కయ్యూరు బాలసుబ్రమణ్యంను రాష్ట్ర పరిశోధన శిక్షణా మండలి (ఎస్.సి.ఇ.ఆర్.టి) రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ తరపున విద్యా అధ్యయన యాత్రకు సింగపూర్‌కు పంపిస్తున్నట్టు విద్యాభవన్ విజయవాడ కార్యాలయం నుండి గురువారం సమాచారాన్ని అందించారు. ఈ నెల 27 నుండి డిసెంబర్ 2వ తేదీ వరకు వారం రోజులు సింగపూర్ లో విద్యా శాలలను సందర్శించి అక్కడి విద్యా సంస్కరణల స్థితిగతుల పై అధ్యయనం చేసి రాష్ట్ర విద్యా శాఖ కు ఒక నివేదికను ఇవ్వనున్నారు. సింగపూర్ అధ్యయన యాత్రకు ఆహ్వానం రావడం పట్ల బాలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. సహచర ఉపాధ్యాయులు బాలుకి అభినందనలు తెలిపారు.

శ్రీ సాయి సుధా ఆస్పత్రిలో ఉచిత బిఎండి పరీక్షలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని శ్రీ సాయి సుధా మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత బియండి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ ఎముకలు, కీళ్లు నరముల వైద్య నిపుణులు డాక్టర్ బి. సుకుమార్ ఇంటస్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ ముంబయి వారిచే ఉచిత పరీక్షలు చేయడంతో పాటు సలహాలు సూచనలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ 45 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ఎముకల సాంద్రత పరీక్షించుకోవాలని, ఎముకల సాంద్రత పరీక్షలు ప్రతి 3 నెలలకు ఒకసారి ఎముకల వైద్యుల్ని కలిసి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు. ఎక్సరే బోన్ డెన్సిటీ టెస్ట్ పరీక్షలతో ఎముకల సాంద్రతను తెలుసుకొని క్యాల్షియం పరిమాణాన్ని సాధ్యమైనంతవరకు ఆహారం ద్వారానే భర్తీ



చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరం నందు సుమారు 50 మందికి పైగా పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బా నాయుడు, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ హిమబిందు, ఫిజియోథెరపీ డాక్టర్ సునీత, పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌కు ప్రోత్సాహం : సిఎండి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

కుప్పం పరిధిలో సోలార్ విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టామని ఏపీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. కుప్పం నియోజకవర్గం పరిధిలోని శాంతిపురం మండలం, అబకలదొడ్డి గ్రామంలో ఎస్సీ/ఎస్టీ వినియోగదారులకు ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్‌ను, బల్లా వద్ద నిర్మాణ దశలో ఉన్న 33/11 కెవి సబ్-స్టేషన్ ను, సోలార్ ప్లాంట్ పనులను సంస్థ డైరెక్టర్ పి. అయూబ్ ఖాన్, చిత్తూరు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇస్మాయిల్ అహ్మద్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ లోతేటి అబకలదొడ్డి గ్రామంలో సోలార్ విద్యుత్తు వినియోగదారులు శ్రీరాములు, పద్మావతి, వెంకటమునిలతో మాట్లాడి రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్ పనితీరు, వివరాలను తెలుసుకున్నారు. గహాలకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు పనుల పట్ల వినియోగదారులు సంతప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్ ను ఏర్పాటు చేసుకునేందుకు వినియోగదారులు ముందుకు రావడం ఆనందాయకమన్నారు. రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్స్ ద్వారా రోజుకి 8 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని, తద్వారా వినియోగదారులు విద్యుత్ బిల్లును ఆదా చేయవచ్చని సూచించారు. అనంతరం బల్లా వద్ద ఏర్పాటు చేస్తున్న 33/11 కెవి సబ్-స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి, సబ్-స్టేషన్ ను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత బల్లా వద్ద పీఎం-కుసుమ్ పథకం కింద ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ పనుల్లో భాగంగా 4.9 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంటు పనులను పరిశీలించారు. ఈ ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి కోసం గాలి మరల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం రెస్కో మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. సోమశేఖర్ పాల్గొన్నారు.



సోలార్ విద్యుత్ లబ్దిదారులతో మాట్లాడుతున్న సిఎండి

విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్

విజన్‌తో ముందుకెళితే అద్భుతాలు
కస్తూర్బా విద్యార్థులతో కలిసి భోజనం
విద్యార్థులతో భువనేశ్వరి ముఖాముఖి



గురుకుల విద్యార్థులతో కలిసి భోంచేస్తూ..

ప్రజాశక్తి -కుప్పం

క్రమశిక్షణ, పట్టుదల ఉంటే విజయం మన సొంతం అవుతుందనే విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తించుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. నాలుగు రోజుల కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా గురువారం నారా భువనేశ్వరి కుప్పం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా పరమసముద్రం కస్తూర్బా గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకుల పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి సందర్భంగా పలు విషయాలను వారితో పంచుకున్నారు. కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొని వారితో కలిసి భోజనం చేశారు. గురుకుల పాఠశాలకు విద్యార్థులతో కలిసి ఆటోలో ప్రయాణించారు. అనంతరం సామగుట్టపల్లిలో విలువల బడి కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజయానికి షార్ట్ కట్ లేదు

పిల్లల భవిష్యత్ బాగుండాలని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారు.. వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత పిల్లలపై ఉందనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఆటపాటతో పాటు కెరీర్ పైనా విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి, కష్టపడకుండా విజయం రాదన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకెళితే అద్భుతాలు సష్టించవచ్చని, ఎన్టీఆర్ , అబ్దుల్ కలామ్, ధీరూభాయ్ అంబానీ, చంద్రబాబు వంటి వారంతా ఎంతో కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. చంద్రబాబు చిన్నతనంలో ఆరు కిలోమీటర్లు నడిచి స్కూల్‌కు వెళ్లేవారని, తనకు తల్లిదండ్రులే స్ఫూర్తి అని తన తండ్రి ఎన్టీ రామారావు ఎంతో కష్టపడి పైకి వచ్చారని, చిన్న వయసులో ఇంటింటికీ వెళ్లి పాలు అమ్మేవారని, ఆ తర్వాత స్కూల్ కి వెళ్లి చదువుకునే వారని, ఎంతోమంది తల్లిదండ్రులు స్థోమత లేకపోయినా వారి శక్తికి మించి పిల్లలను చదివిస్తున్నారన్నారు. వారు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని విద్యార్థులకు నారా భువనేశ్వరి సూచించారు. అలాగే విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా దష్టి పెట్టాలని, క్రీడల్లో రాణించే విద్యార్థులకు సహాయం చేయటానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ఎపుడూ ముందుంటుందని అన్నారు. కస్తూర్బా విద్యాలయానికి 20 కంప్యూటర్లు, నర్సింగ్ విద్యార్థులకు అవసరమైన పరికరాలు అందేలా ఏర్పాట్లు చేస్తామని నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు.



పిల్లలను విలువలతో పెంచాలి

విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక భాధ్యత నేర్పించి బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ బడులను ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. తాను చదువుకున్నప్పుడు స్కూల్లో మోరల్ సైన్స్ ఒక సబ్జెక్ట్ గా ఉండేదని, ఇప్పుడు మళ్లీ పాఠశాలల్లో ఆ సబ్జెక్ట్ తీసుకొచ్చిన మంత్రి నారా లోకేష్ ను అభినందించారు.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు క్లోజ్ అనే బోర్డులు పెట్టడం చాలా సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, టిటిడి బోర్డు సభ్యుడు శాంతారామ్, పి.కె.ఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, ఏం సి ఛైర్మన్ రాజు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వ రాజు, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, సుగుణమ్మ, కమిషనర్ శ్రీనివాసరావు , మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ పాల్గొన్నారు.

డికెపల్లి చెరువులో జలహారతి

హంద్రీనీవాతో కుప్పం ప్రాంతం సస్యశ్యామలం అయ్యిందని.. కష్ణా జలాలతో కుప్పంలో సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీ డీకే పల్లి చెరువులో కష్ణా జలాలకు నారా భువనేశ్వరి గురువారం జలహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కష్ణమ్మను కుప్పంకు తీసుకు వచ్చేందుకు సీఎం చంద్రబాబు మరో భగీరథ ప్రయత్నం చేశారన్నారు. కుప్పం చెరువులో కష్ణ జలాలకు జల హారతి ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. కుప్పం ప్రాంత అభివద్ధికి సీఎం చంద్రబాబు నిరంతరం పరితపిస్తున్నారని, రాష్ట్రానికి కుప్పంలో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

చిరు వ్యాపారులకు ఎన్టీఆర్ ట్రస్ట్ చేయూత

కుప్పం పట్టణంలో చిరు వ్యాపారులకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఎంతగానో చేయూతనిస్తోందని చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్ నారా భువనేశ్వర్‌కు కతజ్ఞతలు తెలిపారు. కుప్పం పర్యటన సందర్భంగా నారా భువనేశ్వరును కలిసిన మంజునాథ చిరు వ్యాపారులకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవలను వివరిస్తూ వ్యాపారస్తుల సమస్యలను నారా భువనేశ్వరికి తెలియజేశారు. చిరు వ్యాపారులకు మరింత చేయూతనిచ్చేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా నారా భువనేశ్వరి హామీ ఇచ్చినట్లు మంజునాథ్ తెలిపారు.

'ఛాయ్ రాస్తా' లోగో ఆవిష్కరణ

మహిళలను వ్యాపారవేత్తలుగా తయారుచేయాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహా సంకల్పంలో భాగంగా డ్వాక్రా మహిళల కోసం నెలకొల్పనున్న ఛాయ్ రాస్తా అవుట్ లెట్ లోగోను కుప్పంలో నారా భువనేశ్వరి ఆవిష్కరించారు. రుచి, శుచి, నాణ్యత ప్రధానంగా కార్పొరేట్ తరహాలో ఏర్పాటు చేయనున్న ఛాయ్ రాస్తా అవుట్ లెట్ ముందుగా కుప్పంలో ప్రారంభించనున్నారు. కుప్పం డెవలప్‌మెంట్ ఆధారిటీ (కడా) మద్దతుతో కుప్పంలో ఈ ఛాయ్ రాస్తా అవుట్ లెట్ ప్రారంభం అవుతుంది. ఒక కుటుంబానికి ఒక వ్యాపారవేత్తను తయారు చేయడంలో కుప్పంను ఓ రోల్ మోడల్ గా నిలిపేందుకు తొలి ఛాయ్ రాస్తాను కుప్పంలో ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. మహిళలు వ్యాపారవేత్తలుగా మారేందుకు చాయ్ రాస్తా ఒక చక్కటి అవకాశమని ఛాయ్ రాస్తా సీఈఓ మైకేల్ జోషి అన్నారు. కుప్పంతో పాటు చిత్తూరు, తిరుపతి, గుంటూరు జిల్లాల్లో త్వరలోనే ఛాయ్ రాస్తా అవుట్ లెట్‌లు ప్రారంభిస్తున్నట్లు ఛాయ్ రాస్తా డైరెక్టర్స్ పోలుదాసు కిరణ్, ఒంటిపులి పూర్ణచంద్ర రావు తెలిపారు. లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్, కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పాల్గొన్నారు.



హంద్రీనీవా కాల్వకు జలహారతి

వార్షిక ప్రణాళికల ఏర్పాటుకు టీమ్‌లు సిద్ధం



ప్రజాశక్తి - బాలాయపల్లి : గ్రామసంఘాల అభివృద్ధి, మండల సమాఖ్య అభివృద్ధితో పాటు మండలాన్ని మోడల్ మండలంగా తీర్చిదిద్దేందుకు అంశాల వారిగా వార్షిక ప్రణాళికలు తయారు చేసేందుకు నాలుగు టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎపియం కిరణ్ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్ర సబ్యులకు, విఓఎలకు మూడవ రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాలలో మండలాన్ని మోడల్ మండలంగా తీర్చి దిద్దేందుకు ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్థుల సృష్టి, సుస్థిర జీవనోపాదులు ఆరు అం శాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలని ఆయా టీమ్‌లకు వివరించారు. ఈ కార్యక్రమంలో శిక్షణాధికారి చెంగల్ రాయులు, ఎల్సీ సీసీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సుబ్బమ్మకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయమందిస్తున్న జనసేన పార్టీ ఉయ్యాల ప్రవీణ్

ప్రజాశక్తి - నాయుడుపేట: ఇల్లు దగ్ధమై నిరాశ్రయురాలైన సుబ్బమ్మకు పలువురు నాయకులు ఆర్థిక సాయమందించారు. ఇల్లు దగ్ధమైన రెండోవ రోజు మునిసిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ పదివేల రూపాయలు అందించారు. నాయుడుపేట, లోతువాని గుంట ప్రాంతంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైన విషయం విదితమే. బాధితురాలు యానాది సుబ్బమ్మకు నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ కాలగంద సుమ, సునీల్ దంపతులు 30 వేల రూపాయల అందజేశారు. గురువారం వారు లోతువానిగుంటకు చేరుకుని దగ్ధమైన పూరింటిని పరిశీలించి, బాధితురాలని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు. నాయుడుపేట ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ ఉయ్యాల ప్రవీణ్ ఆధ్వర్యంలో పలువురు జనసేన పార్టీ నాయకులు సుబ్బమ్మను పరామర్శించారు. సీనియర్ జనసేన పార్టీ నాయకులు అట్ల కృష్ణారావు బాధితురాలికి పదివేల రూపాయల నగదు అందజేశారు. అనంతరం ఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ పూరిల్లు దగ్ధమైన బాధితురాలికి ప్రభుత్వపరంగా సహాయం అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వినుకొండ ధనంజయ, సరసమ్మ, కోకిల, జనసేన పార్టీ నాయకులు గిండి సతీష్, బాలిశెట్టి, శేఖర్, శ్రీను, మున్నా, జనసేన వీర మహిళలు రోహిణి, సల్మా, జ్యోతిష్ తదితరులు పాల్గొన్నారు.

జలదంకి మధుసూదన్ రెడ్డి కన్నుమూత



మధుసూదన్ రెడ్డి (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట పట్టణానికి చెందిన సీని యర్ నాయకులు, ప్రముఖ కాంట్రాక్టర్ జలదంకి మధుసూదన్ రెడ్డి(62) గురువారం సాయంత్రం కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చెన్నై, అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూశారు. ప్రముఖ కాంట్రాక్టర్‌గా పేరు తెచ్చుకున్న జలదంకి మధుసూదన్ రెడ్డి పినాకిని అతిథిగృహం, కండలేరు జలాశయ అతిథి గృహాలను అన్ని హంగులతో నిర్మించిన కాంట్రాక్టర్‌గా మంచి పేరు గడించారు. నాయుడుపేట మండలంలో నిబద్ధత గల సీనియర్ రాజకీయ నాయకుడిగా ఆయనకు పేరుంది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నాయుడుపేట, గాంధీ పార్కు వెనక గల మాతృశ్రీ అపార్ట్మెంట్‌లోని వారి స్వగృహం నుండి అంతిమయాత్ర ప్రారంభమవుతుందని ఆయన కుటుంబ సభ్యులు తెలియజేశారు.

మునీశ్వరికి గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న మునీశ్వరి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : అస్సాం రాష్ట్రం, శిల్చార్ ఎన్ఐటిలో ఎలెక్ట్రిక్ ఇంజనీరింగ్ చదువుతున్న, రేణిగుంట అన్నాస్వామి పల్లెకు చెందిన ఆవుల వెంకట లక్ష్మీ, మునస్వామిల కుమార్తె మునీశ్వరి యాదవ్ ఎలెక్ట్రిక్ ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. ప్రతిభకు పేదరికం అడ్డంకి కాదని నిరూపించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన పెద్దలు, కాలేజీ సిబ్బంది ఆమెను అభినందించారు.

సంజీవరెడ్డికి డాక్టరేట్



ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: స్థానిక నెల్లుట్ల వారి పల్లి పంచాయతీకి చెందిన రామిరెడ్డి సంజీవరెడ్డి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఆచార్య అంజన్ బాబు, ఆచార్య రామ్మోహన్ రెడ్డిల పర్యవేక్షణలో రామిరెడ్డి సంజీవరెడ్డి జనరేషన్ ఆఫ్ బయో జియో డేటా బేస్ ఆన్ నాచురల్ రిసోర్సెస్ ఆఫ్ తిరుమల తిరుపతి ఫారెస్ట్ రీజియన్ యూజింగ్ రిమోట్ సెన్సింగ్ అండ్ స్పెషియల్ మైనింగ్ అండర్ జిఐఎస్ ఏ స్టడీ ఆన్ ఎకలాజికల్ మోడలింగ్ అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీని పొందారు. సంజీవరెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

లోకేష్‌కు ఆర్చరీలో గోల్డ్ మెడల్



ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు, లయోలా జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి వెంకట లోకేష్ విద్యతో పాటు ఆర్చర్ విభాగంలో రాణిస్తూ కోచ్ శివశంకర్ శిక్షణలో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. విజయవాడలో జరిగిన సబ్ జూనియర్ ఇండియన్ రౌండ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. రాష్ట్ర స్థాయి స్కూల్ క్రీడా పోటీల్లో సిల్వర్ మెడల్, ఇండియన్ జూనియర్, సీనియర్ మీట్‌లో స్వర్ణం సాధించారు. 24 నుండి 30వ తేదీ వరకు అరుణాచల్ ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజనారయణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, కరస్పాండెంట్ పంట శ్రీనివాసరెడ్డి లోకేష్‌ను అభినందించారు.

తిరుమలలో అన్యమత స్టిక్కర్ వివాదం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో అన్య మత చిహ్నం స్టిక్కర్‌తో వాహనం తిరగడం కలకలం రేపింది. కొండపై అన్యమత స్టిక్కర్లు ఉన్న వాహనాన్ని గుర్తించిన టీటీడీ, ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. టీటీడీ ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న పోలీసులు.. వాహనంతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వాహనం తమిళనాడు రాష్ట్రానికి చెందినదిగా గుర్తించారు. డ్రైవర్‌తో పాటు వాహన యజమానిపై కేసు నమోదు చేశారు. టీటీడీ అధికారుల తెలిపిన వివరాల మేరకు గురువారం అలిపిరి చెక్ పోస్ట్ వద్ద ఈ వాహనం 9 వ లైన్ గుండా వచ్చినప్పటికీ, అక్కడ తనిఖీ విధుల్లో ఉన్న వాసు బాబు ఈ అన్య మత చిహ్నాన్ని గుర్తించలేకపోయారని టీటీడీ మండిపడింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఈ సమాచారం అందిన వెంటనే, సంబంధిత విజిలెన్స్ సిబ్బంది వాహనాన్ని తిరుమల, ఫైర్ ఆఫీస్ సమీపంలోని పార్కింగ్ ప్రాంతంలో గుర్తించి, వెంటనే ఆ స్టిక్కర్‌ను తొలగించారు. అనంతరం, ఈ విషయంపై తిరుమల టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, తమిళనాడులోని కరూర్ జిల్లాకు చెందిన వాహన డ్రైవర్ గోబి, ఆ వాహనం యజమానిపై ఏపీ చారిటబుల్, హిందూ రిలీజియస్ ఇన్స్టిట్యూషన్, ఎండోమెంట్ యాక్ట్- 1987 పరిధిలో కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అన్యమత స్టిక్కర్లతో వాహనం తిరుమలలోకి వచ్చినా.. గుర్తించడంలో విఫలమైనందున, తనిఖీ అధికారి వాసు బాబును వెంటనే అలిపిరి విధుల్లో నుండి తొలగిస్తున్నట్టు, అతనిపై విధుల్లో నిర్లక్ష్యానికి సంబంధించి శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్టు టీటీడీ పేర్కొంది.

ప్రజారోగ్యమే తొలి ప్రాధాన్యత : ఎమ్మెల్యే కురుగొండ్ల



ఆరోగ్య కేంద్రం తనిఖీలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి, సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. గురువారం ఆకస్మిక తనిఖీకి వెళ్లిన ఎమ్మెల్యే, అక్కడి సిబ్బంది హాజరు, రోగులకు అందిస్తున్న చికిత్స, మందుల లభ్యత, పరిశుభ్రతలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి, వైద్య సేవలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖరీదైన మందులను అందుబాటులోకి తీసుకువచ్చిందని, గుండెకు సంబంధించి రూ. 50 వేలు విలువ చేసే మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రజారోగ్యమే మొదటి ప్రాధాన్యత అని తెలిపారు. ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని, డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎయంసి చైర్మన్, నియోజకవర్గ టిఎన్‌టియుసి అధ్యక్షులు, టౌన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మజిత్ సాహెబ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పురపాలక సంఘం పరిధిలోని గేటు పుత్తూరు, మహమ్మద్ వీధికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మజిత్ సాహెబ్ గత రెండు రోజులుగా అనారోగ్యంతో అన్న గౌరీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆయనను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఆయన వెంట రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, రూరల్ పార్టీ అధ్యక్షుడు బాలాజీ, ముస్లిం నాయకులు హమీద్ భాషా, సర్దార్ భాష, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అరేబియన్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: స్థానిక పివి రోడ్డులో అరేబియన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఆహార ప్రియులకు అరేబియన్ రెస్టారెంట్ కొత్త రుచులను, మంచి అనుభూతిని పంచుతాయని ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. యువకుడిగా రెస్టారెంట్‌ను ప్రారంభించి పలువురికి ఉపాధి కల్పించనున్న ఫయాజ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

దేవస్థానం సూచిక బోర్డులు ఏర్పాటుకు అనుమతివ్వండి

ప్రజాశక్తి-ఏర్పేడు: శ్రీ పరశురామేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి సూచిక బోర్డులను తిరుపతి పట్టణంలో ఏర్పాటు చేసేందుకు అనుమతివ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యకు గుడిమల్లం ఆలయ కార్యనిర్వాహణాధికారి రామచంద్రారెడ్డి వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ అనుమతి ఉత్తర్వులు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

టూ వీలర్ మెకానిక్స్‌కు మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): శ్రీ బాలాజీ టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నెలవారీ సమావేశంలో భాగంగా గురువారం తిరుపతి నగర పరిధిలోని యూత్ హాస్టల్లో నగరంలోని వివిధ హాస్పిటల్స్ నుండి స్పెషలైజేషన్స్ విభాగాలలో మెకానిక్‌లకు మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగిందని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మోహన్ తెలిపారు. తిరుపతిలోని మెకానిక్స్ ఆరోగ్య సంరక్షణలో భాగంగా ప్రతినెల 20వ తేదీ సమావేశం నిర్వహించి, మెడికల్ క్యాంపును నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న కొంతమంది మెకానిక్స్‌కు వైద్య సలహాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చందు, సెక్రటరీ విజయ హరిప్రసాద్, కోశాధికారి షఫీ, జాయింట్ సెక్రెటరీ ఆనంద్, కమిటీ సభ్యులు మధు, నాగరాజు, ప్రసాద్, విజయ్, జాకీర్, మునిరెడ్డి పాల్గొన్నారన్నారు.

ఘనంగా జనకళ్యాణ్ దివస్

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ : బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జనకళ్యాణ్ దివాస్ కార్యక్రమాన్ని గురువారం వెంకటగిరిలో అంబేద్కర్ గారి విగ్రహవం వద్ద ఘనంగా నిర్వహించారు. వెంకటగిరి నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా సెక్రెటరీ రాపూర్ అబ్రహం, నియోజకవర్గ ఇన్చార్జి వెంకన్న, బివిఎఫ్ నియోజకవర్గం కన్వీనర్ కయ్యూరు రాజేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్మిక నాయకులు, కల్లూరు జాన్, పార్టీ కార్యకర్తలు చెంచు కృష్ణ, భాష తదితరులు పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -కోట : ప్రీ మారిటల్ కౌన్సిలింగ్ అవగాహన సదస్సు కార్యక్రమంలో భాగంగా గురువారం కోట ఐసీడిఎస్ సీడిపిఓ మునికుమారి ఆధ్వర్యంలో శ్రీ ప్రగతి కళాశాల, ఏవికేఆర్ జూనియర్ కళాశాల మహిళా విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారిత, మహిళలపై జరుగుతున్న దాడులు, రక్షణ చట్టాలు, ఐసీడిఎస్ సేవలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట అంగన్వాడీ సూపర్వైజర్ క్రిష్ణమ్మ, ఓఎస్సీ నగ్మా, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి, సహాయకురాలు పాల్గొన్నారు.

పెద్ద పేగు కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో అగ్గిచేనుపల్లి, వెదురుకుప్పం మండలం, మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వయం సహాయక సంఘ మహిళలకు, గ్రామస్తులకు పెద్ద ప్రేగు కాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.ఉమాదేవి మాట్లాడుతూ పెద్దప్రేగు కాన్సర్ ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన చెందుతున్న ఆరోగ్య సమస్యఅని, ఆహారపు అలవాట్ల మంచివిగా లేనప్పుడు వస్తుందన్నారు. ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించి చికిత్స ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యమ్. ఇంద్రాణి, స్వయం సహాయక సంఘ మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తమిళనాడు రైతుల విజ్ఞాన యాత్ర

ప్రజాశక్తి - క్యాంపస్ : తమిళనాడు, వేలూరు జిల్లాకు చెందిన 20 మంది రైతులు 'ఆత్మ' సౌజన్యంతో నాలుగు రోజుల విజ్ఞాన యాత్రలో భాగంగా గురువారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. తిరుపతి రూరల్ మండలం, వేమూరుకు చెందిన రాస్ కృషి విజ్ఞాన కేంద్ర దత్తత రైతు అయ్యప్ప నాయుడు ఆచరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. చెరకు, మల్బరీ, పట్టు పురుగుల పెంపకం, ఘన, ద్రవ జీవామృతం, పంచగవ్య, దశపర్ణి కషాయం, అగ్ని అస్త్రం లాంటి వివిధ కషయాలు వారికి వివరించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త, హెడ్, డాక్టర్ శ్రీనివాసులు, దత్తత రైతు అయ్యప్ప నాయుడు, వేలూరు ఆత్మ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పుస్తకాలు ప్రగతికి సోపానాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుస్తకాలు ప్రగతికి సోపానాలని, ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గాలి గుణశేఖర్ పేర్కొన్నారు. గురువారం పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సదస్సు నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా గాలి గుణశేఖర్ హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ పుస్తకాలు దైవ స్వరూపాలని, గ్రంథాలయాలు దేవాలయాలని అన్నారు. గ్రంథాలయాధికారి డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ వెంకటేశన్, నాగేశ్వరరావు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

శుద్ధాద్వైత వాదంపై ఉపన్యాసం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో గురువారం ముఖ్యవక్త భూతపూర్వ కులపతి ప్రొ.హరేకృష్ణ శతపథి మాట్లాడుతూ వల్లభాచార్యుల శుద్ధాద్వైత వేదాంతంపైన వివరించారు. ఈ సందర్భంగా వల్లభాచార్యులు మాట్లాడుతూ మాయా ప్రపంచంలోని మనిషి జీవనానికి ఒక నిర్దిష్ట లక్ష్యం ఉందని, ప్రతి ఒక్కరు వారి జీవితంలో లక్ష్యాన్ని సాధించి, సమాజ హితంతో పాటు భగవత్ప్రాప్తి పొందాలని సూచించారు. సభాధ్యక్షులు విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ వ్యాఖ్యానాలతో విద్యార్థుల్లో శాస్త్రజ్ఞానం, సృజనాత్మక శక్తి పెంపొందిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్ల, సాహిత్య సంస్కృతి డీన్ ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ రైల్వే డివిజన్‌పై అసెంబ్లీలో తీర్మానం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి బాలాజీ జిల్లా డివిజన్ కోసం ఎమ్మెల్యేలు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని బాలాజీ రైల్వే డివిజన్ సాధన కమిటీ సభ్యులు గురువారం పలురు ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రం ఇచ్చారు. నగరి ఎమ్మెల్యే బానుప్రకాష్ ఈ వినతిపై స్పందిస్తూ రాష్ట్రనాయకులు, కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుదీర్ రెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత నాయకులు, అధికారులు దృష్టికి తీసుకెళతానని, అంతర్జాతీయ ఇంటర్నెషనల్ కార్గో టెర్మినల్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సీఎం దృష్టికి తీసుకెళతానని తన వంతు సహకారం ఉంటుందని తెలియజేసారు. ఈకార్యక్రమంలో సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిదర్ కుమార్, ఫిల్మ్ సొసైటీ చైర్మన్ ఎమ్.వేణుగోపాల్ రెడ్డి, అధ్యక్షులు వై ఎస్.బాబు, సూరినేని బుజ్జి బాబు నాయుడు, పి.ఏ.పుష్పరాజ్, అనిల్, శ్రీ కుమార్ పాల్గొన్నారు.

జాబ్ మేళా పోస్టర్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 25వ తేదీ వెంకటగిరి విశ్వోదయ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్లో నిర్వహించబోయే మెగా జాబ్ మేళా పోస్టర్లను గురువారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 14 ప్రముఖ కంపెనీలు 720కి పైగా ఉద్యోగాలు శ్రీ సిటీ, మేనకూరు సెజ్, ఈఎంసి క్లస్టర్, తిరుపతి, చెన్నై ప్రాంతాల్లోని 14 బహుళజాతి కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న వారు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 7013509543, 9491458910 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

రుయాకు కుర్చీ వితరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : సీఐ కేబి శ్రీధర్ మూడో వర్ధంతి సందర్భంగా ఆయన మిత్రులు తిరుపతి రుయా ఆసుపత్రికి ఐరన్ చైర్ వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు వృత్తిలో ఉంటూ ప్రజా భద్రతకు కృషి చేసిన మా మిత్రుడు శ్రీధర్ ఆకస్మికంగా మృతి చెందాడని తెలిపారు. శ్రీధర్ మూడో వర్ధంతి సందర్భంగా రుయా ఆసుపత్రి క్యాన్సర్ ఓపి విభాగంలో రోగులు కూర్చునేందుకు ఐరన్ చైర్‌ను ఉచితంగా అందజేశామన్నారు. అనంతరం ఆసుపత్రి ఎదుట సుమారు 500 మంది రోగులకు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ మిత్రబృందం పాల్గొన్నారు.

రంగినేనికి మళ్లీ మార్కెట్ కమిటీ చైర్మన్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టిడిపి సీనియర్ నేత రంగినేని చెంచయ్య నాయుడు రెండో పర్యాయం నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకమండలిని నియమిస్తూ జీవో జారీ చేసింది. చెంచయ్య నాయుడు రెండో పర్యాయం చైర్మన్ అయ్యారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గౌరవ అధ్యక్షులుగా ఉంటారు. మరో 18 మంది సభ్యులుగా కొనసాగుతారు. ఏడాది పాటు ఈ కమిటీ కొనసాగనుండగా, మరో ఏడాది పొడిగించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

స్కూల్ చైర్మన్ ఎన్నికలు ఏకగ్రీవం



ప్రజాశక్తి -కోట : కోట మండలం, కొత్తపట్నం పంచాయతీ, గోవిందపల్లి, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ చైర్మన్ ఎన్నికల్లో చైర్మన్ గా ఇన్నమాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌గా స్వాతిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కోట మండల ఎస్సీఎల్ అధ్యక్షులు తిరుమూరు మురళి వారికి శుభాకాంక్షలు తెలిపారు. స్కూల్ ఎన్నికలు ఏకగ్రీవం చేయడానికి, సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, దువ్వూరు రామలింగారెడ్డి, చిల్లకూరు దశరథరామి రెడ్డి, ఉప్పల బాలకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఈఓ దారా మస్తానయ్య, స్కూల్ హెచ్ఎం, సిబ్బందికి తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికైన వారు స్కూల్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - రామచంద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా రైతులందరూ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేయాలని రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ నీరజ కోరారు. గురువారం మండలంలోని కుప్పం బాదూరులో ప్రాజెక్ట్ నిధులతో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి, మహిళా అధ్యయన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా రైతులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకుని తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ఆకుకూరలు, కూరగాయలు పండించాలన్నారు. రైతులందరూ వ్యవసాయ పంటల సాగుకు రసాయన ఎరువుల బదులు సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్నారు. జీవామృతం, బీజామృతం, పంచగవ్య, కషాయాల తయారీ విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అసిస్టెంట్ జయశ్రీ, క్లస్టర్ మెంటార్ మిథున్ రెడ్డి, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ రాగమ్మ, నాచురల్ ఫార్మింగ్ హెల్త్ న్యూట్రిషన్ మేఘన, మహిళా రైతులు పాల్గొన్నారు.

పిల్లలు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): సమాజంలో పిల్లలు మంచి నడవడికతో ఉత్తమ పౌరులుగా ఎదగాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ సూచించారు. బాలల దినోత్సవ వారోత్సవాల ముగింపు సందర్భంగా మంగళం, ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ కార్యాలయం పరిపాలన అధికారి విజయ్ కుమార్, టెక్నికల్ ఇంజనీర్ రసూల్, ప్రభుత్వ బాలుర వసతిగృహం పర్యవేక్షణ అధికారులు ఖాసీందొర తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యమంగా మన డబ్బులు.. మన లెక్కలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ప్రతి మహిళా భాగస్వామ్యంతో మహిళా ఉద్యమంగా మన డబ్బులు.. మన లెక్కలు చేపట్టాలని సి సి నాగేంద్రరావు తెలిపారు. గురువారం ఈ-నారీల ఆధ్వర్యంలో నారాయణవనంలోని కావమ్మ గుడి ముందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందరితో ప్రతిజ్ఞ చేయించి, యాప్ ద్వారా సభ్యులు లెక్కలు చూచుకొనే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మానవహారం చేపట్టి, స్టేట్ బ్యాంకు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సిసి నిమ్మి విఓ అధ్యక్షులు కె. గౌరీ, విఓఏ ముని మోహన , ఈ-నారిలు పి. నీలవేణి, ప్రియా, నీలిమ, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పొదుపు రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి-కోట: పొదుపు ద్వారా పొందే రుణాలతో ప్రతిఒక్కరూ ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐకేపి ఏపిఎమ్ అనీలా సూచించారు. కోట మండలంలోని స్థానిక ఐకేపి కార్యాలయంలో గురువారంతో మూడవ రోజు శిక్షణా కార్యక్రమం ముగిసింది. అనీలా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలును ఎలా సద్వినియోగం చేసుకోవాలనే విషయమై మూడు రోజులు పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ ప్రసాద్, శంకరయ్య, అకౌంటెంట్ హిమబిందు, విఓఈ, పొదుపు సభ్యులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల కూటమితోనే సాధ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కూటమి ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల నెరవేరుతుందనిని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక పురపాలక సంఘం, రూరల్ పరిధిలోని లబ్ధిదారులకు పీఎంవై పథకంకింద మంజూరైన పత్రాలను మునిసిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం అందజేశారు. పుత్తూరు అర్బన్‌కు సంబంధించి 325 మంది లబ్ధిదారులకు మంజూరయిన ఉత్తర్వుల పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డిఈ, ఏఈ, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అంచేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి మీనా కుమారి, మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శశికళ, భావనశ్రీ, చెంచులక్ష్మి, దేవి బాల, వెంకటేష్ శయ్యా. రాజశేఖర్ ఏకం రెడ్డి, సిబ్బంది ఎం. సుజాత, మహిళలు పాల్గొన్నారు.

నవజాత శిశు వారోత్సవాలు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం నవజాత శిశు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మధుసూదన రావు, డాక్టర్ యుగంధర్, డాక్టర్ సౌమ్య ప్రియ, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రేవతి మాట్లాడుతూ.. నవజాత శిశువులకు పౌష్టిక ఆహారం అందేలా చూడడానికి, ప్రభుత్వం పోషన్ అభియాన్ పథకం నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌస్ సర్జన్లు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ టాటాబాయి, హెల్త్ సూపరవైజర్లు ప్రమీల, నారాయణరాజు, హెల్త్ అసిస్టెంట్లు సుబ్బలక్ష్మి, గిరిజ, శశిరేఖ, గర్భవతులు, తల్లులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఒంటరి జీవితంపై విరక్తి చెంది..



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఒంటరి జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గురువారం పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధిలో చోటుచేసుకుంది. బాలాజీ(30)కి దిక్కు మొక్కు ఎవరూ లేకపోవడంతో ఒంటరి జీవితాన్ని గడుపుతున్నాడు. చిన్నాచితక పనులు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఈ క్రమంలో ఒంటరి జీవితాన్ని గడపలేక ఉరేసుకుని తనువు చాలించాడు. సమాచారం అందుకున్న వన్ టౌన్ పోలీసులు బాలాజీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పారిపోయిన విద్యార్థులు అప్పగింత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న శివసాయి, అక్షిత్ అనే విద్యార్థులు పాఠశాల నుండి పారిపోగా, వారిని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించినట్లు రూరల్ ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గురువారం పాఠశాల తరగతి గది నుంచి వాష్ రూమ్‌కు వెళ్లి వస్తామని ఉపాధ్యాయుడుకి చెప్పి, ప్రహరీగోడ దూకి బయటకు వెళ్లారని తెలిపారు. విద్యార్థులు తిరిగి రాకపోవడంతో పాఠశాల యాజమాన్యం పరిసర ప్రాంతాల్లో గాలించి వారు కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు. వెంటనే స్పందించిన తమ సిబ్బంది బాలకృష్ణ, సురేష్, శ్రీనివాసులు, విష్ణు రైల్వేస్టేషన్లోని సీసీ కెమెరాలను పరిశీలించారని తెలిపారు. స్టేషన్లో 4 నంబరు ప్లాట్‌ఫామ్‌లో చెన్నై వైపు వెళుతూ ఆగివున్న ఓ రైలు భోగిలో ఉన్న ఇద్దరు విద్యార్థులను గుర్తించి వారిని సురక్షితంగా తీసుకువచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిందన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి




ప్రజాశక్తి - దొరవారిసత్రం: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని ఏకొల్లు రోడ్డు వద్ద చోటుచేసుకొంది. నాయుడుపేట నుండి చెన్నైకి వెళ్లే రహదారిపై వృద్ధుడు మృతి చెందినట్ల పోలీస్‌లు గుర్తించారు. మృతినికి 60 సంవత్సరాల వయసుంటుందని తెలిపారు. మృతిని శరీరంపై ఎటువంటి గాయాలు లేవని తెలిపారు. ఎస్ఐ అజయ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య




ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథలు మేరకు బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలం, వెల్లూరు గ్రామానికి చెందిన నవీన్ తిరుమల - తిరుపతి జీబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద కాపు వీధి లేఔట్ వద్ద ఉన్న గణేష్ రెసిడెన్స్‌లో నవీన్ గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, మృతుడు నవీన్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

ఏపీ ఎన్‌జీఓ నూతన యూనిట్ నియామకం



ప్రజాశక్తి - నాయుడుపేట: ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయుడుపేట తాలూకా యూనిట్ నూతన కార్యవర్గాన్ని తిరుపతి జిల్లా అడ హక్ కమిటీ చైర్మన్ సురేష్ బాబు ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో ఎలక్షన్ అధికారి ఎస్వి శ్రావణ్ కుమార్, అబ్జర్వర్ లలిత్ కుమార్‌లు నాయుడుపేట యూనిట్ నూతన కార్యవర్గాన్ని నియమించారు. నాయుడుపేట తాలూకా యూనిట్ నూతన అధ్యక్షులుగా ఆనందకుమార్, సెక్రటరీగా వి.వి.శ్రావణ్ కుమార్, ట్రెజరర్‌గా కౌశిక్, ఉమెన్ జాయింట్ సెక్రటరీగా మేరీ సుకన్య, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఆర్.కె మంజుల, జాయింట్ సెక్రటరీలుగా సరిత, సంజీవయ్య బాలకోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లు గా రాజేష్, సయ్యద్ బాబు, అనిల్ కుమార్‌లు ఎన్నికైనట్లు నాయుడుపేట తాలూకా యూనిట్ అధ్యక్షులు కె.ఆనంద్ కుమార్ తెలియజేశారు.

పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో అన్నదానం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద జనసేన నాయకులు పేటా బ్రదర్స్ ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశయాల సాధన కోసం ప్రతి గురువారం తమ వంతు బాధ్యతగా పేదల కడుపు నింపుతున్నట్లు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి తెలిపారు. నిరంతరం సీతమ్మ అన్నదాన కార్యక్రమం జరుగుతుందని స్పష్టం చేశారు. తేజ, మణి, ప్రదీప్ కుమార్, మహేష్, దేవరాజ్, ముని చంద్ర, రాజా, సాయి తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల నాణ్యతపై బొజ్జల పరిశీలన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం లోని అన్న క్యాంటీ న్లను గురువారం స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పరిశీలించారు. స్వయంగా భోజన నాణ్యత, నిర్వహణ, సదుపాయాలను తనిఖీ చేశారు. రుచి, నాణ్యత, పరిశుభ్రతపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అవసరమైతే మరింత మెరుగులు దిద్దేందుకు అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రజలకు నాణ్యమైన భోజనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమనీ, ఈ దిశగా నిరంతర తనిఖీలు కొనసాగుతాయని ఎమ్మెల్యే తెలిపారు.